ఏదీ చెత్తశుద్ధి?

- నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు
- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం
- వర్మీ, సేంద్రియ ఎరువుల తయారీ ఎప్పుడు ?
- అధికారుల పర్యవేక్షణ కరువు


మాడగడ గెడ్డ వద్ద నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

అరకులోయటౌన్: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ఆరోగ్యాన్ని పరిరక్షించి పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో ప్రగతి కనబడటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాలను స్వచ్ఛంగా ఉంచేందుకు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినా ఎక్కడా శుభ్రత కనిపించడం లేదు. అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు 125 మంజూరు చేశారు. 40 కేంద్రాలు నిర్మాణాలు పూర్తి చేశారు. కేవలం 8 కేంద్రాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. జనాభా ప్రాతిపాదికన స్వచ్ఛభారత్ నిధుల నుంచి ఒక్కో యూనిట్‌కు రూ. 4 లక్షల నుండి రూ.9 లక్షల వరకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టారు. మండలాల్లో ఒకటి, రెండు చోట్ల మినహా ఎక్కడా ఈ పనిచేసిన దాఖలాలు లేవు.

ముఖ్య ఉద్దేశం

గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తతో పాటు వీధుల్లోని చెత్తను సేకరించి రిక్షాల ద్వారా సంపద కేంద్రాలకు తరలించాలి. ప్రత్యేకంగా ప్లాస్టిక్ డస్ట్‌బిన్‌లు ఇంటింటికి పంపిణీ చేశారు. కేంద్రాల్లో వాటికి కేటాయించిన తడి, పొడి చెత్త కుండీల్లో నిల్వ చేయాలి. నిల్వ చేసిన వాటిలో వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువులు తయారు చేసి, రైతులకు తక్కువ ధరలకు విక్రయించాలి. గ్రామాల్లో ప్లాస్టిక్, స్క్రాప్, వ్యర్థ పదార్థాలను దుకాణాలకు విక్రయించి పంచాయతీల అదనపు ఆదాయాలను పెంచాలన్నదే సంపద సృష్టించే కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యం.

సంపద సృష్టించే కేంద్రాల వివరాలు ఇలా...

- అరకులోయ మండలంలో మొత్తం 14 కేంద్రాలు మంజూరైతే కేవలం నాలుగు పూర్తి చేశారు. పెదలబుడు పంచాయతీ అరకులోయ పట్టణంలోని రైల్వే గేటు వద్ద ఉన్న సంపద కేంద్రం మాత్రమే వినియోగంలో ఉంది.
- ముంచంగిపుట్టు మండలంలో 22 మంజూరు కాగా నాలుగు పూర్తయి వినియోగంలో ఉన్నాయి. 8 కేంద్రాలు 90 శాతం పనులు పూర్తయింది. మిగిలిన పది నిర్మాణ దశలో ఉన్నాయి.
- డుంబ్రిగుడ మండలంలో 18 గ్రామ పంచాయతీలకు 10 కేంద్రాలు మంజూరు కాగా వీటిలో నాలుగు కేంద్రాలు పూర్తయ్యాయి, మరో 8 కేంద్రాలు మంజూరు కావల్సి ఉంది.
- పెదబయలు మండలంలోని 23 పంచాయతీల్లో 10 కేంద్రాలు మంజూరు కాగా 10 కేంద్రాలు నిర్మించారు కానీ కేవలం రెండు కేంద్రాలు వర్మి కంపోస్టు తయారీ జరుగుతుంది. మరో 10 కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. 3 కేంద్రాలు మంజూరు కావలసి ఉంది.
- అనంతగిరి మండలంలో 17 కేంద్రాలు మంజూరు కాగా 16 కేంద్రాలు పూర్తి చేశారు. అయిదు కేంద్రాల్లో సంపద సృష్టి జరుగుతుంది. మిగిలిన 11 కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది.
- హుకుంపేట మండలంలో మొత్తం 31 కేంద్రాలకు 2 కేంద్రాలు పూర్తి చేస్తారు.

ఎరువులు తయారీ చేయాలి



చెత్త సంపద సృష్టి కేంద్రాల నిర్మాణాలకు గత ప్రభుత్వం లక్షల రూపాయలు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం వాటిలో వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువుల తయారీ జరగడం లేదు. ఎక్కడ చెత్త సేకరించిన దాఖలాలు లేవు. గ్రామాల్లో చెత్త కుప్పలు పేరుకపోయాయి. ఈ కేంద్రాల వల్ల ప్రయోజనం లేదు.

– కె. గుప్త, ప్రధానిపూట్ గ్రామం, పద్మాపురం పంచాయతీ, అరకులోయ

ప్రతిపాదనలు పంపాం



విద్యుత్, నీటి సమస్య వల్ల కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారు కావడంలేదు. కేవలం అరకులోయ పట్టణంలోని సంపద తయారీ కేంద్రంలోనే వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువుల తయారీ జరుగుతుంది. త్వరలో మిగిలిన కేంద్రాల్లో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

– కె.వి.ఎ.సత్యనారాయణ, ఈఓపీఆర్డీ, అరకులోయ

క్లుప్తంగా

అరకు ఎంపీ దృష్టికి సమస్యలు


ఎంపీ తనుజారాణికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మ. తనుజా రాణికి వినతిపత్రం ద్వారా తెలియజేసినట్టు గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పాడేరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో అరకు ఎంపీ డాక్టర్ తనుజారాణిని కలిసి గుంటసీమ పంచాయతీతో పాటు మండలంలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు సమస్యలను వివరించినట్టు చెప్పారు. దీనిపై ఆమె స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అరకు ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ నందివలస గ్రామంలో ఆర్మీ ఎక్స్ సర్వీస్‌మెన్ పాంగి మల్లన్న మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదివారం వారి స్వగ్రామానికి వెళ్లి మల్లన్న భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లన్న పాడెను మోసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతికి గల కారణలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కితలంగి, పద్మాపురం సర్పంచ్‌లు వి.సుబ్బారావు, పెట్టెలి సుస్మిత తదితరులున్నారు.

పోలీసుల విధులపై అవగాహన


విద్యార్థులకు ఆయుధాల గురించి అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అప్పలసూరి

గూడెంకొత్తవీధి: ప్రజల రక్షణ కోసమే పోలీసులు పనిచేస్తున్నారని పోలీసుల విధుల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ అప్పలసూరి అన్నారు. పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, ఇతర సాంకేతిక పరికరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసులు నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

రహదారులు జలమయం


డుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ: మండలంలోని ఆదివారం సాయంత్రం మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం విపరీతమైన ఎండతో అల్లాడిన ప్రజలకు రెండు గంటల నుంచి వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉదయం మంచుతో, మధ్యాహ్నం ఎండతో, సాయంత్రం వర్షంతో విభిన్న వాతావరణం డుంబ్రిగుడలో కనిపించింది.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కొయ్యూరు: మండల కేంద్రంలో చింతాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పర్యాటక ప్రాంతాలు, రిసార్టులపై ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరావు

చింతపల్లి: పర్యటక ప్రాంతాలు, రిసార్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంటుందని చింతపల్లి ఎస్ఐ వెంకటరావు చెప్పరు. ఆయన మండలంలోని తాజంగి, లంబసింగి, చెరువులవెనం ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఈ మూడు నెలలు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు అధికంగా వస్తున్నందున వారి భద్రతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. రిసార్టుల యజమానులతో త్వరలో సమావేశం ఏర్పాటుచేసి నిబంధనలు పాటించాలని కోరతామన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, పెద్ద శబ్దాలతో డీజేలు వంటివి పూర్తిగా నిషేధించామన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. బోటు షికారు, జిప్‌లైనర్ వద్ద పర్యాటకుల భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పర్యటక వికాస్ చైర్మన్ శంకర్, సభ్యులు సత్తిబాబు, కూటమి నాయకులు పురుషోత్తం, శ్యాంసుందర్, నారాయణ, రామారావు శేఖర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట


ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

కొయ్యూరు: మండలంలోని చీడిపాలెం పంచాయతీ సింగవరం ఐటీడీఏ కాలనీలోని రామాలయంలో సీతారామ లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పాల్గొన్న భీమిలి సద్గురు సేవా ఆశ్రమం స్వామిజీ సాయిరాం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. వెయ్యి హనుమాన్ విగ్రహాల వితరణ లక్ష్యంగా చేసుకొని ఇప్పటివరకు 810 విగ్రహాలను అందజేశామని, కొయ్యూరు మండలంలో 118 విగ్రహాలను వితరణ చేశామన్నారు. జలుమూరి వెంకట గిరిబాబు దంపతులతో విగ్రహాల ప్రతిష్టాపన చేయించారు. ఈ కార్యక్రమాన్ని అర్చకులు స్వరూపానంద నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం సీతారాముని కల్యాణ వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. జేవీ గిరిబాబు అనే భక్తుడు ఆలయానికి మైక్ సెట్‌ను వితరణ చేశారు. అనంతరం గ్రామస్తులు విగ్రహాల దాత సాయిరాంను ఘనంగా సన్మానించారు.

సత్యదీక్షమాల ధరించిన భక్తులు


సత్య దీక్ష చేపట్టిన మాలధారులు

అడ్డతీగల: అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో మొదటి ధఫా సత్య దీక్ష మాలధారణ కార్యక్రమం ఆదివారం జరిగింది. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు భక్తులకు మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆలయంలో అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి మాలధారులతో సామూహిక పూజలు చేయించారు. రమాదేవి అమ్మవారికి కుంకుమ పూజ గావించారు.పవనగిరి క్షేత్ర పాలకుడైన అభయాంజనేయస్వామి వారికి ప్రత్యేకంగా సింధూరంతోను తమలపాకులతో పూజలు జరిపారు. దీక్ష నియమాలను వివరించారు. మొదటి విడతగా 79 మందికి 27 రోజుల దీక్ష కోసం మాల ధారణ చేయించినట్టు వెంకటరామయ్య చెప్పారు. దీక్ష విరమణ సమయంలో తిరిగి పవనగిరి క్షేత్రంలో ఇరుముడులు వేయించి అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో దీక్ష విరమించి స్వామి వారిని దర్శించుకుంటారని వెంకటరామయ్య చెప్పారు.

కొర్రలో తాగునీటి ఎద్దడి

- నిరుపయోగంగా మారిన తాగునీటి పథకం
- గెడ్డనీరే శరణ్యం.. ప్రబలుతున్న రోగాలు
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు


కొర్రలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం

డుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయతీ కేంద్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో తాగునీరు కల్పించేందుకు నిర్మించిన నీటి పథకం అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామంలో తాగునీటి కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో మంజూరైన నీటి పథకం వల్ల గ్రామస్తులకు నీటి సమస్య ఉండేది కాదు. అయితే గడిచిన నాలుగు నెలలుగా పైపులైన్ మరమ్మతు వల్ల నీటి సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా తాగునీటి పథకం నిరుపయోగంగా మారడంతో స్థానికులకు నీటి సమస్య వెంటాడుతోంది. బిందెడు నీటి కోసం గ్రామస్తులు మండుటెండలో కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరాజు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక సుదూరంలో ఉన్న గెడ్డల్లోని కలుషిత నీటినే ఉపయోగిస్తున్నామని, దీంతో రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా నేటి వరకు గ్రామాల్లో ఎటువంటి మౌలిక సదుపాయాల పనులు కల్పించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కొర్ర పంచాయతీలో నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

శిథిలావస్థలో పాఠశాల

- అధ్వానంగా భవనం
- వర్షం పడితే గదులన్నీ జలమయం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు


లోతట్టు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పిల్లలు

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతం బడదనాంపల్లి పంచాయతీకు చెందిన కొత్త బొర్రంపేట (రాజుపేట)లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలస్థితికి చేరుకొంది. ఈ గ్రామంలో సుమారు 36 ఆదివాసీ కుటుంబాల వారు జీవిస్తున్నారు. మండల కేంద్రానికి దూరంగా ఉన్న ఈ గ్రామంలోని పాఠశాలలో 27 మంది విద్యార్థిని, విద్యార్థులు చదువుతున్నారు. ఇంత మంది పిల్లలకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. ఏ మాత్రం వర్షం వచ్చినా పైకప్పు నుంచి వర్షపునీరు కారి గదులన్నీ పూర్తిగా తడిసి పోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల శిథిల భవనం గోడలు బీటలు వారాయని, పైకప్పు పెచ్చులూడుతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, రన్నింగ్‌వాటర్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు అత్యవసరమైతే పాఠశాలకు దూరంలో ఉన్న తుప్పలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. పాముల బెడద ఉందని తమ పిల్లలకు ఏ ఘోరం జరుగుతుందోనని భయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కుమారి, సర్పంచ్ సుభద్ర తదితరులు

గూడెంకొత్తవీధి: మండలకేంద్రంలో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ సుభద్రలు ఆదివారం శంకుస్థాపన చేశారు .ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి వెలుగు, నీటి పారుదలశాఖ, కల్యాణ మండపాన్ని కలుపుతూ తహసీల్దారు కార్యాలయం వరకూ 200 మీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి, రాజులమ్మ, వైస్ ప్రెసిడెంట్ రాంబాబు, కో–ఆప్షన్ సభ్యుడు దావీద్, బీజేపీ , జనసేన నాయకులు పాల్, వీర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్


రోడ్డులో బైఠాయించిన సీపీఎం నాయకులు

అరకులోయ టౌన్: మండలంలోని శిరగం పంచాయతీ వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానికులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మారుమూల పంచాయతీ అభివృద్ధికి దూరంగా ఉండి రవాణా సౌకర్యాలు సక్రమంగా లేక స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మా పంచాయతీకి ఎటువంటి అభివృద్ధి సంస్థ ఐటీడీఏ నిర్లక్ష్యం చేయడం వల్ల మా పంచాయతీలో రోడ్డు మార్గం మరమ్మతుకు నోచుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు సొమన్న, చిట్టిబాబు, యువకులు డిమాండ్ చేశారు.

మండల సమావేశం రేపు

ముంచంగిపుట్టు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం. శ్రీసాయిహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ముఖ్యంగా అన్ని శాఖల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి రావాలని, గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


సిలిండర్ నుంచి చేలరేగుతున్న మంటలు

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండల పంచాయతీ కేంద్రంలోని ఓ దుకాణంలో గ్యాస్ సిలిండర్ లీకేజీకి గురైంది. గ్రామానికి చెందిన సంతోష్ టీ స్టాల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ని నిర్వహిస్తున్నాడు. టీ చేసే సమయంలో ఒక్కసారిగా గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగి ఎగిసిపడ్డాయి. దీంతో పక్కన ఉన్న దుకాణదారులతో పాటు స్థానికులు పరుగులు పెట్టారు. గ్యాస్ లీకేజీతో మంటలను ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ మంటలు జోరుగా చేలరేగాయి. కొందరు సాహసించి గ్యాస్ బండపై ఇసుకను వేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

కాఫీ రైతులకు నిధులు చెల్లించాలి


మహాదేవపురంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

జి.మాడుగుల: జిల్లాలోని 10వేల మంది కాఫీ రైతులకు చెల్లించాల్సిన ప్రోత్సాహక నిధులు రూ.5కోట్లు తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. మండలంలో గెమ్మెలి పంచాయతీ మహాదేవపురం గ్రామంలో ఆదివారం మండల పార్టీ మహాసభలు జరిగాయి. ముందుగా పార్టీ జెండాను నాయకుడు వనుగు సన్యాసిదొర ఆవిష్కరించారు. నాయకులతో కలిసి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చిన్నయ్యపడాల్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరంలో కాఫీ ప్రోత్సాహక నిధులు 10 వేల మందికి కాఫీ రైతులకు ఒక్కో ఎకరానికి రెండు దఫాలుగా రూ.4వేలు, 5వేల చొప్పున రైతు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, ఆయా నిధులు ఎందుకు జమలేదన్నారు.

కాఫీ బోర్డుకు, కాఫీ రైతులకు రూ.154కోట్లు నిధులు విడుదలయ్యాయని వాటిని రైతులకు ఎప్పుడు చెల్లిస్తారని ఆయన ప్రశ్నించారు. కాఫీ అపెక్స్ కమిటీ ప్రకటించిన ధరలు పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ.285, అరబిక్ చెర్రీ రూ.150, రొబస్టో చెర్రీ రూ.88, పండ్లు రూ.44 ప్రకటించిందన్నారు. ఈ కాఫీ ధరలు రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు ధరలు కావుని, పార్చ్‌మెంట్ రూ.500, రొబస్టో చెర్రీ రూ.300,చెర్రీ రూ.200 పండ్లు రూ.100 ధర ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కాఫీ రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలని ఉపాధి హామీ పథకం కూలీలకు రూ.150 నుంచి రూ.200 చెల్లిస్తున్నారని, చట్ట ప్రకారం గిరిజన ప్రాంతంలో రూ.300 చెల్లించి 200 రోజుల పని దినాలు కల్పించాలని ఆయన కోరారు. ఇటీవల తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులు పండించిన పసుపు, పిప్పళ్లు, అల్లం, రాజ్‌మా, చింతపండుకు గిట్టుబాటు ధర కల్పించాలని, గిట్టుబాటు ధరకు చట్టం తేవాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలో పలు గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, సాగునీరు, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు తదితర సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమం కొనసాగిస్తామని మహాసభలో తీర్మానించారు. పార్టీ మండల కార్యదర్శి ధర్మన్నపడాల్, నాయకులు దీనబంధు, శంకయ్య,ధర్మారావు, పిన్నంనాయుడు, సత్తిబాబు, గణపతి, మధు, ఈశ్వరమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలను అమలుచేయాలని డిమాండ్


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ

గూడెంకొత్తవీధి: వెలుగు వీవోఏలు మూడేళ్ల కాల పరిమితికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వెలుగు వీవోఏలతో ఆయన సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడేళ్ల కాలపరిమితితో జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం దీన్ని అమలుచేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. వీవోఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పుష్ప, రామలింగం, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న జన విజ్ఞాన వేదిక ప్రతినిధి పారయ్య

పాడేరు : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పాడేరు పట్టణంలో లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చెకుముకి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ఐటీడీఏ పరిధిలోని పాడేరు, అరకు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, చింతపల్లి మండలాలకు చెందిన తొమ్మిది పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగం నుంచి అరకు క్రీడ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో సీకరి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ప్రైవేటు పాఠశాల విభాగంలో పాడేరు శ్రీ అక్షర పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా పెదబయలు సెయింటాన్స్ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పాఠశాలలు నవంబర్ 9న విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారు. ఆదివారం జరిగిన పోటీల్లో విజేతలకు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యండమూరి పారయ్య బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పదాన్ని అలవర్చుకోవాలన్నారు. మూఢ నమ్మకాలను వదిలి నాటు మందులు, పసరు మందులకు దూరంగా ఉండేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు.